**Sakshi, 8th June 2008**

# చిరుధాన్యాల వాడకాన్ని పెంచాలి : సతీష్

పంజాగుట్ట: పోషక విలువల కొరతను తీర్చేందుకు చిరుధాన్యాల వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందని డక్కన్ డవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ పి.వి.సతీష్ అన్నారు. శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోషక విలువలు అధికంగా లభించే చిరుధాన్యాల ఉత్పాదక శక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సజ్జలు, రాగులు, కొర్రలు, సామలు, సోయాసిస్ వంటి చిరుధాన్యాలను ఉత్పత్తి చేస్తున్న వ్యవసాయదారులకు పర్యావరణపరమైన బోనస్‌ను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎకరాకు రూ. 5 వేలను ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పంటలను పండించే వారంతా సన్న, చిన్నకారు రైతులేనన్నారు. వీరికి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో చిరుధాన్యాల ఉత్పాదక శక్తి దాదాపు 35 శాతం తగ్గిపోయిందన్నారు. వర్షధార పంటలైన చిరుధాన్యాలను పీడీఎస్ ద్వారా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా తమ సొసైటీ ఆహార భద్రత కోసం నిర్మాణాత్మకమైన కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో అఖిల భారత కిసాన్ సమన్వయ సమితి నాయకుడు విజయ్ జవామెలియా, చిరుధాన్యాల వ్యవసాయదారుల సమాఖ్య కర్ణాటక అధ్యక్షుడు డి. బి. గౌడ్‌లు పాల్గొన్నారు.